# వీరుడు మహావీరడు

"శ్రీరామనవమి సంబరాల్లో గంజిపేట రౌడీకి అల్లిపురం వస్తాదుకి 'టగ్గాఫార్' పడింది. ఇద్దరూ హోరాహోరీ కొట్టేసికుంటున్నారు.

గంజిపేట రౌడీ యింతుంటాడు. అంగుళం దళసరి కళ్ళద్దాలెట్టుకు చూస్తేగాని అగుపించదు మనిషి. అయితే నల్లిక నరంలా సాగుతున్నాడు.

అల్లిపురం వస్తాదు సెట్టంత మనిషి. తలుసుకుంటే యీడిలాటి రౌడీలు యిద్దరు ముగ్గురు కాదు– అరడజను మందొస్తే కరకర యిరిసేసి సున్నంలోకి ఎఁవికి లేకుండా నలిపేస్తాడు. అయితే ఎందుకు పస్తాయిస్తు న్నాడూ – సుట్టుతా జనం వున్నారు.

మళ్ళా ఆ జనఁవైనా ఎవళూ? ఎవళేనా వయసులో వున్న గుంటల్నేడిపిస్తుంటే యీళ్ళూ ఆ మందలో జేరిపోయి, మర్నాడుదయం అదంతా తమ ప్రతాపఁవే అని చెప్పుకునే యువక బృందమూ; రోజల్లా పులేసా లెనక తోకలు మోసి మోసి అలిసి పోయినాక, పుల్లుమందుకొట్ల కేసిపోతే టీ సుక్కలకి టికాణా లేక యీదురోమని యిళ్ళకు పోతున్న మాజీ పుల్లూ, ఇంటికాడ ఆడంగులు ఈదిల తొంగోమంటే నిద్దరట్టక సంబరాల సర్దాలేనా సూద్దాఁవని బజారునపడ్డ బోసిపుల్లూ; కంబైండ్ స్టడీస్‌కని బయల్దేరి నేస్తాలిళ్ళల్లో పుస్తకాలిసిరేసి ఈదినపడ్డ కుర్ర విద్యార్థులూ: బేరాల్లేక బెల్లులు మోగిస్తూ కూకునే రిక్షా వోళ్ళూ; డొక్కు దుకాణాల్లో కప్పులు కడుక్కునే కుర్ర గుంటలూ – యీళ్ళే అక్కడున్న జనం.

ఆళ్ళ మద్దె నేనే కసింత నదరైన మనిషిని.

నేనేటీ – సంబరం సూదాఁవని బయల్దేర్లేదు. మినర్వాలో జేమ్సుబాండు గాడిపిక్చరొచ్చిందంటే రెండు మైళ్ళూ కాళ్ళీడ్చుకుని రెండో ఆట సినిమాకెళ్ళేను. ఎళ్తే బుకింగ్ బంద్. ఉఁహ్ – రానే వచ్చేనని అలా మెయిన్ రోడ్డున పడి రెండు మూడు పందిళ్ళు చూసుకుని, నిద్దర దండుగయ్యిందని తిట్టుకుంటూ యింటి కెళ్ళి పోతున్నాను. ఇంతలో ఈ స్టంటు సీను తగిలింది.

ఏటఁ్రా! ఏటి సంగతంటే ఎవడూ సెప్పడు. పది మంది నడిగితే ఒక్కడు గావాల అన్నాడు "ఏదో ఆడపిల్ల తగువు నాగుందండి" అని, 'ఒహ్హో' అనుకొని, సుట్టూసూస్తే ఏ ఆడపిల్లా కనపడదు. ఇంకోడన్నాడు – 'ఈడూ ఇంకోడూ తన్నుకుంటుంటే ఆడొచ్చినాడండీ. ఇడిపిచ్చినట్టే ఇడిపిచ్చి ఈణ్ణాడు పట్టేసి ఆ ఇంకోడిసేత తన్నించేసినాడు. అందుకని ఆ కసికొద్దీ సాల్లేనని తెలిసీ, ఈడు అతడితో దెబ్బలాడుతున్నాడు' అంటూ కసింత క్లూ ఇచ్చేడు.

ఈడు – అంటే గంజిపేట వీరుడు. ఆడంటే – వస్తాదు. మొదట తగువు తెచ్చినోడు ఎప్పుడో జారుకున్నాట్ట. సెప్పొద్దు, నాకు మా చెడ్డ కోపం వొచ్చింది – తంతున్న వాడి మీదా కాదు – వాపులు తింటున్న వాడి మీదా కాదు. చూస్తున్న జనం మీద.

అవునండీ! మీరూ నేనూ తన్నుకుంటుంటే మన తగువేదో మనం సెటిల్ చేసుకోవాల. ఇంకోడొచ్చి యింట్రఫియరవడం, అలాటప్పుడు సుట్టూ వున్న జనం చూస్తూ వూరుకోడఁవా? ఆడు వస్తాదైతే? ఆడు ఒక్కడు... జనం వందమంది. తలో చేయీ ఏసేస్తే ఏఁవఁవుతాడు? వస్తాదు కాదు ఆణ్ణి పుట్టించిన జేజమ్మయినా భూఁవిలోకి దిగడిపోతాడు. అదేం కాదుట, కోడిపుంజులో గొఁర్రెపొట్టేళ్ళో కుమ్ముకుంటుంటే సూస్తారూ, అలా సూస్తన్నారు. జనం. పోనీ యీక్వల్ ఫైటా? అదీ కాదు – సముజ్జీ దెబ్బలాడుతున్నారంటే – ఏదో పేద – ప్రజ! టికెట్ లేని ఎంటర్‌టైన్‌మెంటు – ఎఫ్ఫెన్‌గా సూస్తే సూసేరని సరిపెట్టుకుందును.

ఆడుచూస్తే జమాజట్టి – అల్లిపురం వస్తాదు ఆరడుగులు పైనేగాని కింద కుండడు! ఆడు ఒక్కొక్క గిల్లంతా యిస్తే మూడు మూడు పిల్లిమొగ్గలేస్తున్నాడు ఈ గంజిపేట గుంటడు – పడి వూరుకోడే 'లంజ కొడకా! కొడతావురా! చిన్నోణ్ణి చేసి కొడతావా! ఇడిపించడానికి కొచ్చి కొడతావా! నీ నెత్తురు కళ్ళ జూస్తాను'. అంటూ మళ్ళా మళ్ళా పైకొస్తాడు. మళ్ళీ ఆడొక్కతాపు తంతే ఎగిరి అల్లం దూరంలో పడతాడు.

చెప్పకేఁవీ ఆడి పౌరుషం తల్చుకుంటే నాకిప్పటికీ ఒళ్ళు జల్దరిస్తది. గొప్ప పౌరుషంలే. మనిషిని సూస్తే వస్తాదులో నాలుగోవంతు కాదు, పదో వంతేనా వుంటాడా అనిపిస్తాడు. వస్తాదు ఆరడుగుల మనిషి. తయ్యారీలు గియ్యారీలు, కదుపెక్కతిని, కసరత్ గిసరత్ చేసిన మనిఁషేవో – అంతకో జబ్బా యింతకోతొడా ఏనుగులాగున్నాడు. ఈడూ వయసులో వున్న కుఁర్రోడే! అయితే ఈ పూటకుంటే ఆ పూటకి టికాణా లేని గంజిపేట సరుకు. ఈడు ఆడితో దెబ్బలాడ్డఁవంటే మాటలేటి! అందులోనూ అంతకు ముందొకడితో కలబడి కొంత చితిగున్నాడు.

అయితే మనిషికా ఫైటింగ్ స్పిరిటు వొకొక్కప్పుడలా వొచ్చేస్తాది. ఎలాటప్పుడు? న్యాయం నీ పక్కనుండాల. అవతలోడు ఫౌలు గేమాడల. అదేవంటే, దౌర్జన్యానికి దిగాల; సూస్తున్నోళ్ళు సీఁవ కుట్టినట్టు మాటాడకూరు కోవాల! జనం

అవతలోడి బలానికి జడిసి అన్యాయానికి నోరెత్తకుండా వున్నారని నువ్వు గ్రహించాల. ఆ జనం పిరికితనం చూసి ఆడి జులుం మరీ మరీ పెరిగి పోతుండాల. అదిగో అలాటప్పుడు వొచ్చేస్తాది ఎక్కళ్ళేని ఫైటింగ్ స్పిరిటూ. అప్పుడు పిల్లి లాటోడైనా పిల్లపులై పోతాడు. పులి పిల్లలా ఎగిరి ఏనుగు కుంభస్థలఁవైనా అందుకోడానికి పంజాచాస్తాడు.

నీలోనే లొసుగుందనుకో, అప్పుడూ నువ్వు దెబ్బలాడొచ్చు. కాని సందుదొరికితే సాలు, సంధికి రడీ అయిపోతావు.

ఇద్దరు దెబ్బలాడుతుంటే ఎవడిది తప్పని ఎవ్వళ్ళీ అడగక్కర్లేదు. అడిగితే ఆడిది తప్పని ఈడూ, ఈడిదే తప్పని ఆడూ, ఎలాగూ సెప్తారు. అడక్కుండా ఆ పక్కన్నిలపడి ఆళ్ళ మొహాల్లోకి చూడు, తప్పెవళదో ఎవడూ సెప్పక్కర్లేకుండానే కరక్టుగా నువ్వే చెప్పేస్తావు.

అందుకే నా సింపతీ అల్లిపురం వస్తాదుమీద కాక గంజిపేట రౌడీ మీదే వుండీది.

ఆ డొక్కొక్క కిక్కిస్తుంటే అది రౌడీగాడి పక్కలో కాకుండా నా డొక్కలో తగిల్నట్టుండీది. రౌడీగాడు కిందపడి లేస్తుంటే 'అమ్మయ్యా!' అనుకునేవాణ్ణి. ఈడి దెబ్బలు ఆడికేం తగిలీవి కావు. తగిలిందో పడపడ సప్పట్లు కొట్టేయాలనిపించీది. ఒక్కొకసారి ఏఁవనిపించీది తెలుసా, ఏఁవైతదైంది ఎళ్ళినేను వస్తాదు గాడిమీద కలియ్‌బడి పోదునా అనుకునేవాణ్ణి. కాని కుదరదు. ఎంచేత? ఏసుకున్న టెర్లిన్ బట్టలు సిరిగిపోతాయ్. ఎన్నడూ దెబ్బలాడినోళం కాం. ఆడు సూడబోతే వస్తాదు దెబ్బలాడ్డమే ఆడి బిజినెస్సు. సుఖానున్న ప్రాణం దుఃఖాన పెట్టుకోవడం తప్ప లాభఁవేటి? మళ్ళా అనుకునీవాణ్ణి... ఆడిని మించి పోనక్కరలేదు – ఆడితో సమఁవై పోయినా, ఆడొక్కడూ మేమిద్దరం కాబట్టి ఆణ్ణి కొట్టేసుందుం. నాకెప్పుడూ అనిపించలేదు. గాని అప్పుడు మాత్రం కసరత్ చెయ్యనందుకూ, స్ట్రీటు ఫైటంటే సిగ్గనిపించినందుకూ మహా చెడ్డ విసవిస లనిపించింది. సరిగ్గా అలాట్టైంలో వొచ్చేడు కొత్తపేట శాండో. కొత్తపేట శాండో అంటే, మీరెప్పుడైనా ఆణ్ణి సూసేరా? ఒకపాలి సూస్తే మరి మరిచిపోరు. అలాటి విగ్రహం ఆ మనిషిది. ఆరున్నర అడుగుల పొడవు, అరవై అంగుళాల ఛాతి. అలాటి మనిషి యిండియాలో ఎక్కడా దొరుకుతాడు? సైంటిఫిక్ లైన్లో పెంచిన బాడీయేమో మోచెయ్యెత్తి గుద్దితే ముప్ఫై టన్నుల రాయైనా ముగ్గు ముగ్గయి పోతాది.

అయితే ఆడు కొత్తపేట శాండో అన్న సంగతి అక్కడ శానా మందికి తెలీదు. నాకూ, నాలాటి వాళ్ళే లోక పితలు ఇంకెవరైనా వుంటే ఆళ్ళో కొందరికీ, జనం ఎనక నక్కి నిల్చున్న ఆడి శిష్యులిద్దరికీ తెలుసు. అల్లిపురం వస్తాదు ఎరిగే వుంటాడని ఏరే చెప్పక్కర్లేదు.

నర నారాయణులు పోరాడే రణ రంగభూఁవిలో నారదుల వారిచే పిలువబడి భూఁవికి అవతరించిన పరమ శివుడిలా పోజు పెడుతూ వొచ్చేడు శాండో. వచ్చి 'ఏటిది' అన్నాడు. దెబ్బలాడుతున్నోళ్ళు ఎవళెవళో ఇలాగిలాగ సూస్తూ.

ఆణ్ణి సూస్తున్న జనం యీడెవడన్నట్టూ, యీణ్ణి తెచ్చిన నారదుడెక్కడన్నట్టూ దిక్కులు పరికిస్తున్నారు. కథ ముదురుద్ది గాఁవాలనుకున్నాన్నేనున్నూ.

అప్పటికప్పుడే నూరుసార్లు మన్ను తిని నూటొకటోసారి లెగడఁవే ఓ ఫీటుగా లెగుస్తున్న గంజిపేట వీరుడు – "లెంజకొడకా? నే నియ్యాళ నీ సేతులో సచ్చైనా పోతాను గాని, నీ రకతం కళ్ళ జూడక మాన్రా?" అంటూ తూలి నిలబడుతూ కొత్తగా దిగిన శాండో కళ్ళ కడ్డఁవైతే యీడెవడన్నట్టు మసక్కళ్ళు అప్పళించి చూసేడు.

"రారా భాడకావ్. నీకు ఏ లంజకొడుకడ్డు పడతాడో నేనూ సూస్తా" అన్నాడు. వస్తాదు.

తమాషా తెలుసా? అంతవరకూ చెయ్యీ కాలూ యిసరడం తప్పించి నోరు తెరవలేదు వస్తాదుగాడు. శాండోని చూశాక అలాగన్నాడు.

ఇది గమనించడం వల్లో, ఆ మాట మీద కొత్తపేట శాండో తల తిప్పిన పద్ధతి చూసో, జనం కందరికీ గుండెల్లో రాయి పడిపోయింది. అందరి సంగతెందుకు – నామటుకు నాకే యింకక్కణ్ణించి జారుకోవడం మంచిదనిపించింది.

అయితే – గంజిపేట రౌడీ తగ్గడే! ఆడు అలిసలిసి ఉన్నాడేఁవో మాట మాటకీ జాపోసి పోతున్నాడు. ఏక్షన్ సేస్తూ మాటాడదాఁవంటే చేతులూ తలా లేవవు. మునిసిపల్ దీపాల ఎల్తురవ్వబట్టి గాని వగలైతే ఆడి మొహం చూడలేవనుకుంటాను. అయినా ఆడి గొంతులో మాత్రం పవరు తగ్గలేదు.

"ఈ లంజకొడుకు యిడిపించడానికొచ్చి తంతన్నాడు: ఈడు, నన్ను – ఒంటిగాణ్ణి సేసి – తంతన్నాడు. ఈడి వస్తాదు వొడుపులన్నీ సిన్నోణ్ణని నా మీద యిసురుతున్నాడు". .... అని "ఈడు నన్ను సంపీనానికి నెట్టుకున్నాడ్రో" – ... అని ఒక్క బొబ్బందుకుంటూ పరుగునెళ్ళి ధన్‌మని లెగిసిపోయేడు ఆకాశంలోకి!

అలాంటప్పుడు – కొత్తపేట శాండో ... ఎవడు? అంతవరకూ దెబ్బలాడిన అల్లిపురం వస్తాదు కాదు – అప్పుడే వచ్చిన కొత్తపేట శాండో – అమాంతం ఎళ్ళి ఆడి కుడిచెయ్యి టక్‌ని అందుకున్నాడు. జనం కకావికలై చినుకుల్దెబ్బకి చీమల

పుట్టలు చెదిరి పోయినట్టు చెదిరి పోతున్నారు. పట్టుకున్న ఆ చెయ్యి వెనక్కి తిప్పుతూ అన్నాడు... ఎవడితో? గంజిపేట రౌడీతో – అంటే దెబ్బలు తింటున్న వాడితో ఏవనీ?

"ఇంక శాంతించు"

"ఆ మాట ఆడితో సెప్పు"

"ఆయన్తో కాదు. నీతోనే చెప్తున్నాను"

"ఆ మాట ఆడితో చెప్పరా శాండో, ఆడితో చెప్పు. నువ్వు కొత్తపేట శాండోవని నాకు తెల్సు. నీ వెనక బోల్డు బలగం వుందనీ నాకు తెల్సు. తాపులు తింటున్నది నేను. తంతున్నది ఆడు, ఆడు నన్నేకాదు, నిన్ను కూడా సవాల్ చేస్తున్నాడ్రా! నీ క్కలేజా వుంటే దెబ్బలాడు. నాతో కాదురా ఆడితో, లేదా – తప్పుకో!" అన్నాడు ఒక్క బొబ్బెట్టి. క్షణకాలం పిన్‌డ్రాప్ సైలెన్సు. ఆ తర్వాత – "సరే నీ మాటే కానీ" అంటూ – మెలి తిప్పిన చెయ్యి పట్టుకుని, చెయ్యినీ, చెయ్యితో పాటు శవంలాంటి ఆ మనిషినీ – ఒక్కదుట్న యెనక్కి లాగి ఒకిసురుదు ఇసిరీసేడు శాండో. ఆ దెబ్బకు మూడంతర్లు కొట్టి తెరిచి పెట్టిన అల్లిపురం వస్తాదు కబంధ హస్తాల్లో పడ్డాడు రౌడీ. ఆ డెక్కడెళ్ళి పడతాడో తెలిసిన వాళ్ళాగ, అతడికి తగిన పని చేసేనన్నట్టుగా వెనక్కి తిరిగైనా చూడకుండా ఎళ్ళిపోయాడు శాండో..."

"తరవాతే వయ్యింది!"

"ఏఁవౌద్ది! రణగొణ ధ్వనీ, సంకుల సమరమూ జరిగినవి. గంజిపేట రౌడీ ప్రజల తటస్థ వైఖరిని నిరసిస్తూ ఆడి భాషలో జనం గాళ్ళకి అప్పీల్ చెయ్యడం మొదలెట్టాడు. దాంతో జనం రెచ్చిపోయి తలకో చెయ్యా ఏసీసేరు".

"ఎవరి మీద"

"మరెవరి మీద, గంజిపేట రౌడీ మీద!"

"......................"

"అవునండీ తనకి తోచైనా తోచాల. ఒకడు చెప్పినప్పుడు యినుకోనైనా యినుకోవాల, శాండో ఎందుకీణ్ణి సైడు చెయ్యలేదు? ఈళ్ళిద్దరూ అల్లిపురం వస్తాదుని కొట్టలేరనా, ఈడి సాయం కూడా దేనీకి? ఆడు ఊ అంటే ఆడెనకున్న శిష్యులే భక్షించేస్తారు – ఒక వస్తాదును కాదు, వొరసపెట్టి నలుగుర్ని.

అయితే? అంతతో అయిపోయిందేటి? అల్లిపురంలో యింక వస్తాదుల్లేరా? ఆళ్ళుగాని గాజులు తొడిగించు కుంటారా! గొప్పకి పోయి ఆర్తజన త్రాణమూ, అండర్ డాగ్ పక్షమూ అన్నాడంటే, అప్పుడు కొత్తపేట శాండోల్నందర్నీ దింపాల ముగ్గులోకి.

దింపేడో పుచ్చెలెగిరి పోతాయ్. పోలీసులొస్తారు. ఒకటా గొడవ? రెండో వొరల్డు వారే! – టౌన్ హేమా హేమీలంతా ఇన్వాలవ్వల సొస్తాది.

ఆ ఒక్క క్షణం పిన్‌డ్రాప్ సైలెన్సులోనే యిన్ని పోయింట్లూ ఆలోచించీసేడు కొత్తపేట శాండో. అందుకే "నేగ్గా" ఆ గొడవ అలాగ పీస్‌ఫుల్‌గా సెటిల్ చేసీసేడు. లేప్పోతే అబ్బో ఆ మట్టున శానా గొడవై పోద్ది. అయితే ఇక్కడో సిన్న పోయింటుంది.

అదే – ఆడి ఒంటికే మొప్పం వొస్తే ఆడు అలాగ ఒగ్గీసునా?

ఒగ్గడు. నిజవే. అప్పుడాడి పేటోళ్ళందర్నీ పిలుస్తాడు. అసలాడు పిలవక్కర్లేదు. ఆడి బక్తులు ఆడి పిలుపక్కర్లేకండానే అగ్గిలో దూకేస్తారు. బిగ్‌పవర్‌లో ఉన్న ఆకర్షణే అది. మనం వనుకుంటాం గాని యే కాలంలోనైనా, ఏ లెవల్లోనైనా బిగ్గూ, స్మాలూ తేడాలు వుండనే వుంటాయి. ఇప్పిడీ ఎలక్ట్రీ పవరే వుంది. మొదట జనరేటరుంటే కదా – ఈ హీటర్లు, ఇంజనాలు దీపాలెలగడం. మెయిన్ దెబ్బ తినీసిందంటే తక్కినోటికి బతుకేదీ?

కొత్తపేట శాండో లాజిక్కు మనకందదు గాని, అందితే అదే సరైనదనిపిస్తాది. నన్నడిగితే గంజిపేట వీరుడుకి ఆ మర్యాద అలా జరగవలసిందే. లేప్పోతేనే ప్రమాదం.

అవును గురూ! అలాటోళ్ళు, ఏటనుకుంటారంటే, జనం జూస్తూ అన్యాయాలు జరగనిస్తారా? అనుకుంటారు. అనుకుని – న్యాయం ధర్మం – అని పెద్ద పెద్ద కబుర్లతో చిక్కుల్లో పడతారు. పడి ఒకళ్ళకి తెద్దునా, అందరికీ తెద్దునా అని క్రైసీసులు సృష్టిస్తారు.

ఒక్కసారి జనం సంగతేటో తెలిస్తే మరింకెప్పుడూ అలాటి ఎర్రి కుట్టి ఏషాలెయ్యడు. అందికే ఆడి మంచికోరే నేనూ ఆడిమీద ఓ చెయ్యేసీసేను". ★

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక : 5-4-1968)*